అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం
ఇన్‌చార్జి పామెన భీంభరత్

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కగా అమలు చేసి తీరుతుందని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండలంలోని రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు గురువారం పామెన భీంభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ గ్రామంలో జరిగే ప్రజాపాలన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తరువాత పదేళ్లు కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉందని అందుకే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాపాలన తీసుకొచ్చిందన్నారు. గ్రామాల్లో జరిగే గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిప్పని అంజిరెడ్డి, ఈదులపల్లి రాములు, సీహెచ్. రాజేశ్, అల్లాడ హరీశ్వర్‌రెడ్డి, టి అంజిరెడ్డి, గొంగుపల్లి కృష్ణ, మంగలి మానేయ్య, బి యాదయ్య, పి. దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ
ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ రేపటితో ముగియనున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల సర్పంచ్ బి శైలజ, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డిలు అన్నారు. చేవెళ్ల పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం నాటికి 1,703 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నరేందర్‌రెడ్డి, యాదయ్య, నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: అర్హులందరికీ ఆరు గ్యారంటీల ద్వారా సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల, పెద్దఎల్కిచర్ల గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రావిర్యాల గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: ఈ నెల 6వరకు ప్రజాపాలన దరఖాస్తులు చేసుకోవాలని సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి దర్శన్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఆరుగ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నందిగామలో..

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రారంభించిన ప్రజాపాలనను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. బుగ్గోనిగూడలో సర్పంచ్ బండి నీలమ్మ అధ్యక్షతన గురువారం ప్రజాపాలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రియాంక మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలలో ఇప్పటికే ఒక్క పథకమైన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం నేరవేర్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు సాలయ్య, బుగ్గ నర్సింహా, యాదయ్య, రామచంద్రి, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


భీంభరత్‌తో రేగడిఘనాపూర్ గ్రామస్తులు


షాబాద్: సంకెపల్లిగూడలో..


కొందుర్గు: దరఖాస్తులను చూపిస్తున్న అధికారులు


చేవెళ్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న వెంకట్‌రెడ్డి

క్లుప్తంగా

విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి కృషి

ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు


సభ్యత్వ నమోదు చేయించిన అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు

చేవెళ్ల: విద్యార్థుల సమస్యలు పరిష్కరించి వారికి ఎల్లవేళల అండగా ఉండేందుకు ఎస్ఎఫ్ఐ కృషి చేస్తోందని చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బి అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని పలు కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలోని సమస్యలపై నిరంతర పోరాటం చేసేందుకు ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శివ, కుమార్, రావినారాయణ, రమ్య, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన


సర్టిఫికెట్‌లు అందుకున్న మహిళలతో సంస్థ సభ్యులు

తుర్కయంజాల్: స్వయం ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధ్యమని ఎయిర్ వాటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ప్లాంట్ ప్రతినిధి జయరామన్ అన్నారు. గురువారం టైలరింగ్, బ్యూటీషియస్ కోర్సు పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో షైన్ సంస్థ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీసింగ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

తలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాంగ్రెస్ సీనియర్ నేత దాసరి యాదయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బాలాజీసింగ్ విదేశాల నుంచి వచ్చి తెలంగాణ కోసం కల్వకుర్తి నియోజకవర్గంలో గ్రామగ్రామాన తిరిగి ఉద్యమాన్ని ఉధృతం చేశారని గుర్తుచేశారు. బాలాజీసింగ్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని, రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న సర్పంచ్, ఈఓ, ఆలయ కమిటీ సిబ్బంది

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. గురువారం సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆదాయం రూ. 48,177 వచ్చినట్లు ఈఓ స్నేహలత తెలిపారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, సీనియర్ అసిస్టెంట్ రవి, క్లర్క్ అంజనేయులు, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, చంద్రయ్య, మాజీ సర్పంచ్ మణెమ్మ, యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, యాదయ్య, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ శ్రీశైలం యాదవ్, హరిమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. ప్రతి ఏడాది నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. గురువారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గోదా రంగనాద తులసిదళ అర్చన, తిరుప్పావై ప్రబంధ విన్నపం, నక్షత్రహారతి కార్యక్రమం నిర్వహించారు.

రేపటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6వ తేదీ వరకు ఉంటుందని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. ఐదోరోజు మొయినాబాద్ మండలంలో 1,566 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించి, ఇరుముడితో శబరిమలకు స్వాములు బయలుదేరారు. శివసాయి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి పూజలు, భజనలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. అయ్యప్ప స్వాములు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ పట్వారి జైన్ రామ్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రామ్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

పెద్దూర్ తండాలో..
తలకొండపల్లి: మండల పరిధిలోని పెద్దూర్ తండాలో గురువారం అయ్యప్ప స్వాములు పడి, మెట్లు, ఇనుముడి పూజలు ఘనంగా నిర్వహించారు. ఇనుముడి కట్టు అంటూ అయ్యప్ప నామ కీర్తనలు ఆలపించారు. ప్రాంగణమంతా అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. కన్నుల పండువగా కొనసాగిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచ్‌లు శ్రీశైలం, సక్రి, కిషన్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, శ్రీను, భిక్షపతి, పణీందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

నోడల్ అధికారి,
సర్దార్‌నగర్ జీహెచ్‌ఎం లక్ష్మణ్

షాబాద్: బడీడు పిల్లలను తప్పని సరిగా పాఠశాలలో చేర్పించాలని షాబాద్ మండల నోడల్ అధికారి, సర్దార్‌నగర్ జీహెచ్‌ఎం లక్ష్మణ్, కుర్వగూడ సర్పంచ్ బుయ్యని సంధ్యా మల్లిఖార్జున్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడలో ఆకృతి ఫీల్డ్ ఆఫీసర్ సవిత ఆధ్వర్యంలో పాఠశాలకు వెళ్లని విద్యార్థుల గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరాక్షరాస్యత నిర్మూలనకు, విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించి, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరిని పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. బడిబయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకృతి ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, కో ఆప్టెడ్ మెంబర్ దాదె మహేశ్, నర్సింహులు, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


కుర్వగూడలో అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎం లక్ష్మణ్, సర్పంచ్ సంధ్య

భయం వీడితే విజయం మీదే

మనస్తత్వవేత్త సుధీర్ సంద్ర

షాద్‌నగర్: విద్యార్థులు పరీక్షలు అంటే భయపడొద్దని, భయాన్ని వీడితేనే విజయం మీ సొంతం అవుతుందని ప్రముఖ మనస్తత్వవేత్త సుధీర్ సంద్ర అన్నారు. గురువారం పట్టణంలో ఠాగూర్ ఉన్నత పాఠశాలలోని శ్రీరంగరాయ ఆడిటోరియంలో ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మనస్తత్వవేత్త సుధీర్ సంద్ర, మెంటా అకాడమీ చైర్మన్ మనోజ్‌కుమార్, విశ్రాంత డీఈఓ విజయ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ సంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి రాణించాలన్నారు. అన్ని విషయాలపై సమగ్రంగా అవగాహన పెంచుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి శారీరక, మానసిక ఒత్తిడిలకు గురికాకుండా ఉండాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకుంటే ఎన్ని అవరోధాలు వచ్చినా సులభంగా అధికమించొచ్చని అన్నారు. సమయ పాలన అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమైనదన్నారు. విద్యార్థు పరీక్షలు ముగిసే వరకు సెల్‌ఫోన్‌లు, టీవీలు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎన్‌కే రాజేంద్రప్రసాద్, రవిప్రకాశ్ హర్మాశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సుధీర్ సంద్ర

బస్సులను పునరుద్ధరించండి

వికారాబాద్ డిపో మేనేజర్‌కు
గ్రామస్తుల వినతి

చేవెళ్ల: రెండేండ్ల నుంచి బస్సు సౌకర్యం నిలిపి వేశారని, మళ్లీ తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ తంగడపల్లి గ్రామస్తులు గురువారం వికారాబాద్ ఆర్టీసీ డిపోమేనేజర్‌కు వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి దాదాపు 50ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదన్నారు. కరోనా, లాక్‌డౌన్ కారణంగా బస్సును నిలిపి వేశారని ఆయన గుర్తు చేశారు. దాదాపు రెండేండ్లుగా గ్రామానికి వచ్చే బస్సు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులు గ్రహించి బస్సులను తిరిగి పునఃరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించుకోవడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం 3 కిలో మీటర్ల దూరంలోని కొత్తపల్లి టూ తలారం బస్సులో వచ్చి నడుచుకుంటూ గ్రామానికి వెళ్తున్నారన్నారు. తమ గ్రామం మండలానికి 15కిలో మీటర్ల దూరంలో ఉందని దీంతో తమకు రవాణ సౌకర్యాలు సక్రమంగా అందడంలేదన్నారు. తమ గ్రామం మీదుగా వికారాబాద్ టు హైదరాబాద్ రహదారికూడా ఉండడంతో ఈ మార్గంలో ఇటూ చేవెళ్ల, శంకర్‌పల్లి, అటూ వికారాబాద్ జిల్లాలోని పలు గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ డిపో అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో శ్రీశైలం, పాండుయాదవ్, ఆంజనేయులు, రాఘవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ సలీమ్, తదితరులు పాల్గొన్నారు.


డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న తంగడపల్లి గ్రామస్తులు

ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

షాద్‌నగర్: ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలని కోరుతూ గురువారం సీపీఎం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు శ్రీను నాయక్ మాట్లాడుతూ ఆధార్ కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు వెలితే పెద్దపెద్ద క్యూలైన్లు కనిపిస్తున్నాయన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు. అదేవిధంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 20 వరకు పొడిగించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కురుమయ్య, మీదిపేట రాజశేఖర్, శ్రీకాంత్, మీనాజ్ బేగం, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

మీర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన 44 చెక్కులను గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సముచిత గౌరవం

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవం కల్పిస్తుందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. గురువారం పలువురు ఉద్యమకారులు జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డిని కలిసి సంక్షేమ పథకాలను ఉద్యకారులకు అందజేసే విధంగా కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో ఏళ్లు ఉద్యమం చేశారన్నారు. రాష్ట్ర సాధనకు ఎంతోమంది ఆత్మబలిదానాలు, ప్రాణ త్యాగాలు చేసుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర మరువలేనిదన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ ప్రజల మనోభావాలను గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. వినతి పత్రం అందదజేసిన వారిలో సిరాజుద్దీన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అయోధ్య అక్షింతల శోభాయాత్ర


అక్షింతల వితరణలో పాల్గొన్న రమేశ్

ఇబ్రహీంపట్నం: అయోధ్య రామ మందిరం నుంచి తెచ్చిన శ్రీరాముని అక్షింతల శోభాయాత్రను దండుమైలారం గ్రామంలో గురువారం నిర్వహించారు. శ్రీరాముని అక్షింతలు ప్రజలు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిధర్, గ్రామ సర్పంచ్ రావణమోని మల్లీశ్వరి జంగయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీశైలం, శ్లోక స్కూల్ చైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హరినారాయణ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంగ ఐలేశ్‌తోపాటు గ్రామస్తులు రమేశ్, భంగిని మఠం నీలకంఠప్ప, సాయికుమార్‌చారి, గుండ్ల శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, పట్నం శ్రీశైలం, అయ్యప్పరెడ్డి, చింతల కృష్ణ, లింగస్వామి, శివకుమార్, మాధవరెడ్డి పాల్గొన్నారు. జైశ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు చేసుకుంటూ భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

అయోధ్య అక్షింతల వితరణ
తుర్కయంజాల్: అయోధ్యలో శ్రీరాముడి ఆలయం త్వరలో ప్రారంభం కానుండటంతో ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తోందని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేశ్ అన్నారు. గురువారం తుర్కయంజాల్‌లో ఆయన అక్షింతల వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తూళ్ల వసంత, మారగొని సునీత, మంగ విమల, లక్ష్మి, వనజ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జ్వరమని వస్తే.. చంపేశారు..

- వైద్యం కోసం వచ్చిన మహిళ మృతి
- మృతదేహంతో హాస్పిటల్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

షాద్‌నగర్‌రూరల్: చలి, జ్వరంతో ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన మణెమ్మ(60) చలి, జ్వరం రావడంతో ఈ నెల 2న పట్టణంలోని పరిగిరోడ్డులో గల ఏబీవీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. మణెమ్మను పరిశీలించిన వైద్యులు చలి, జ్వరంతో పాటుగా లో బీపీ ఉందని, పరీక్షలు చేయాలని సూచించారు. దీంతో వైద్యులు సూచన మేరకు పరీక్షలు చేసి, చికిత్స కోసం అడ్మిట్ చేసుకున్నారు. వైద్యం కోసం లక్ష రూపాయలు చెల్లించారు. రోగి ఆరోగ్యం మెరుగుపడటం లేదని, మరో ఆస్పత్రికి తీసుకువెళ్తామని కుటుంబ సభ్యులు వైద్యులను కోరారు. పేషెంట్ ఆరోగ్యం బాగానే ఉందని, త్వరలోనే కోలుకుంటుందని వైద్యులు చెప్పారు.

పరిస్థితి విషమించిందని...
రెండు రోజుల తరువాత మణెమ్మ పరిస్థితి విషమంగా ఉందని, మరో ఆస్పత్రికి తీసుకువెళ్లాలని డాక్టర్లు కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో ఆమెను వెంటనే వాహనంలో హైదరాబాద్ తీసుకెళ్తుండగా కొద్ది దూరం వెళ్లగానే మణెమ్మ చనిపోయింది. దీంతో మణెమ్మ కుటుంబ సభ్యులు మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు కదిలేదిలేదు..
మా అమ్మ చావుకు ఏబీవీ ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యమే కారణమని, న్యాయం జరిగే వరకు కదిలేది లేదని మృతురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. చికిత్సకోసం డబ్బులు కట్టించుకున్న వైద్యులు మా అమ్మకు సరైన వైద్యం అందించకనే చనిపోయిందని ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. చికిత్స కోసం నడుచుకుంటూ వచ్చిన మహిళ వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని ఆరోపించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఆందోళనతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఎస్ఐ దేవకితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతురాలికి అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని పట్టణ సీఐ ప్రతాప్‌లింగం హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.


మణెమ్మ


ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు